కేటీఆర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు


కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పావనీ జంగయ్య, ముత్యాలుయాదవ్, కాంగ్రెస్ శ్రేణులు

- మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య
- ఘట్‌కేసర్‌లో కేటీఆర్ దిష్టబొమ్మ దహనం

ఘట్‌కేసర్: రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో రికార్డు డ్యాన్స్‌లు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అనడం సిగ్గుచేటని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలు యాదవ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకాన్ని చూసి ఓర్వలేక మహిళలను అవమానించడం సరికాదని, వెంటనే మహిళ లోకానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకష్ణముదిరాజ్, డీసీసీ ఆంజనేయులుయాదవ్, జంగయ్యయాదవ్, నాగరాజ్ ముదిరాజ్, అంజిరెడ్డి, రాంరెడ్డి, రహీం, సంజీవరెడ్డి, వెంకటేశ్, ఫరూక్, శ్రీనివాస్, రాజారత్నం, విజయ్, రఫీయుద్దీన్, ఖయూమ్, నర్సింగ్ రావు, సునిల్, రవీందర్, రాజు, యాదగిరి, రవిగౌడ్ పాల్గొన్నారు.

కీసరను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలి


ఎంపీ ఈటలను కలిసిన భోగారం గ్రామ నేతలు

కీసర: ఓఆర్ఆర్‌కు వెలుపల ఉన్న కీసర, భోగారం, అంకిరెడ్డిపల్లి గ్రామాలను కలిసి కీసర పట్టణాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని వివిధ పార్టీల నేతలు కోరారు. మున్సిపాలిటీగా కాకుంటే జీహెచ్ఎంపీలోనైనా కలపాలని కోరుతూ శుక్రవారం భోగారం గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ నేతలు మేడ్చల్–మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కీసర మండలంలో ఓఆర్ఆర్ లోపల గ్రామాలతోపాటు, ఓఆర్ఆర్‌కు ఆనుకొని ఉన్న కొన్ని గ్రామాలను జీహెచ్ఎంపీలో కలిపి, భోగారం, అంకిరెడ్డి పల్లి గ్రామాలను యాదాద్రి భువనగిరి జిల్లాలోని మండలాల్లో కలిపేందుకు యత్నిస్తుందని వివరించారు. ఈ విషయంపై ఎంపీ ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో మాట్లాడారు. మేడ్చల్ జిల్లా రూరల్ పరిధిలోని మండలాలకు అనుబంధంగా ఉన్న గ్రామాలను జీహెచ్ఎంసీలో గానీ మండల కేంద్రాలను మున్సిపాలిటీలుగా మార్చి మిగిలిన గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీడీపీ మేడ్చల్ ఇంచార్జ్ సుంకరి వెంకటేష్, వివిధ పార్టీల నేతలు రాగుల అశోక్, నత్తిరాములు, భాగయ్య, నల్ల వెంకట్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జగన్, శ్రీనివాస్, మురళి, బుచ్చిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి బీజేపీ నేతల నివాళి

మేడ్చల్: భారతరత్న మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి వాజ్‌పేయికి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. బీజేపీ నాయకులు ఆంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, ప్రేందాస్, శ్రీకాంత్, అర్జున్, వంశీ, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా మహాచండీ యాగం


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

కీసర: గోధుమకుంట గ్రామ పరిధిలోని ఓమోజయా శ్రీ భవతి క్షేత్రంలో శుక్రవారం విశ్వ మహిళలు వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహా చండీ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ భవతి క్షేత్రం నిర్వాహకులు పరమోజీ శ్రీ రుషి ప్రజ్ఞానంద స్వామిజీ తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

శామీర్‌పేట్: నూతన వ్యవసాయ పద్ధతులపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు అన్నారు. దక్షిణ తెలంగాణ సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ మల్లారెడ్డి, భువనగిరి ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్ శుక్రవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, బాబాగూడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అలియాబాద్ గ్రామంలో వరి పంటను పరిశీలించి పురుగు, తెగుళ్లు, ఎరువుల వాడకం విత్తనాల గురించి రైతులకు సలహాలు సూచనలు అందించారు. బాబాగూడలోని పండించే కూరగాయల తోటల గూర్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్, ఏఈఓ రవియాదవ్, రైతులు వెంకట్ రెడ్డి, కృష్ణగౌడ్, రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వరలక్ష్మీ నమోస్తుతే

- వరాలతల్లికి వాడవాడలా ప్రత్యేక పూజలు
- వరలక్ష్మి వ్రతాల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు
- వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు


చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తదితరులు

మేడ్చల్: మహిళలు పరమ పవిత్రంగా భావించే శ్రావణ మాసం శుక్రవారం రోజున అత్యంత వైభవంగా వరలక్ష్మీ వ్రతాలను జరుపుకొన్నారు. ప్రతిఇంట్లో మహిళలు ఆకు వక్కలు, పండ్లు ఒకరికొకరు వాయినాలుగా ఇచ్చుకున్నారు. ఇళ్లలో మహిళలు వరలక్ష్మీ అమ్మవార్లను అందంగా తయారు చేసి 9 రకాల వంటలు తయారు చేసి ప్రసాదంగా పెట్టి వేద మంత్రాలతో పూజలు చేశారు. బంగారు ఆభరణాలు, వెండి పాత్రలు, కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించి వ్రతాలను జరుపుకొన్నారు. వ్రతాలకు వచ్చిన మహిళలకు పసుసు కుంకమ, పండ్లు పువ్వులు వాయినాలుగా ఇచ్చారు. ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి.

కీసరగుట్టలో...

కీసర: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతాల్లో పెద్ద ఎత్తున భక్తులు, పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న చీర్యాల శ్రీలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో ఆలయ చైర్మన్ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు వరలక్ష్మీ వ్రతం విశిష్టతను భక్తులకు వివరిస్తూ పూజను నిర్వహించారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు.

ఘట్‌కేసర్‌లో...

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో వరలక్ష్మి వ్రతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని నూతన వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి ఇంటిలో ప్రతిష్ఠించారు. కళకాలం సౌభాగ్యవతిగా ఉండాలని అమ్మవారిని వేడకుంటూ ఇరుగు పొరుగు మహిళలకు పసుపు, కుంకుమ, అరటిపండు, తమల ఆకులతో వాయనం ఇచ్చిపుచ్చుకున్నారు.


మేడ్చల్‌లో వరలక్ష్మీ వ్రతంలో మహిళలు


కీసరగుట్టలో పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్


ఘట్‌కేసర్ సాయినగర్‌లో వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటున్న మహిళలు

కుక్క కాటు బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో...

తక్షణమే వైద్యం అందించాలి


సీహెచ్ఎన్‌సీలో కిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్ పోట్రు


ఆస్పత్రిలో పర్యటిస్తున్న కలెక్టర్ గౌతమ్ పోట్రు

- బాధితుల వివరాలను మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయాలి
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు
- మేడ్చల్ సీహెచ్ఎన్‌సీని సందర్శించిన కలెక్టర్

మేడ్చల్: కుక్కకాటుకు గురైన వారికి తక్షణమే వైద్య సేవలు అందించాలని మేడ్చల్ జిల్లా జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు ఆదేశించారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కుక్క కరిచిందని ఎవరైనా ఆస్పత్రికి వస్తే వారికి సత్వరమే వైద్యులు చికిత్సలు చేసి అవసరమైన మందులు ఇవ్వాలని అన్నారు. కుక్కకరిచిన వారు ఏ ప్రాతం నుంచి వచ్చారో తెలుసుకుని వారి వార్డు, గ్రామాల వివరాలు మున్సిపల్ కమిషనర్, గ్రామ అధికారులకు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీని వల్ల ఆయా ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు స్టెరిలైజేషన్ చేసే వీలు ఉంటుందని అన్నారు.

- వీధి కుక్కలు, కోతుల నుంచి ప్రజలను కాపాడే బాధ్యత అందరిపై ఉందని వాటి నుంచి రక్షించుకోవడానికి కాటుకు గురైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిపించాలని సూచించారు.
- సీజనల్‌గా వ్యాపించే డెంగీ, మలేరియా, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మురుగు, కలుషిత నీరు, ఆహారం నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
- రాపిడ్ టెస్టు కిట్స్ ద్వారా బ్లడ్ శాంపిల్స్ తీసుకుని జ్వర తీవ్రతను బట్టి అత్యవసరమైన వైద్య సదుపాయం అందించాలని సూచించారు. మున్సిపల్, గ్రామీణ సిబ్బంది దోమల వ్యాప్తి లేకుండా ప్రతి రోజూ ఫాగింగ్ చేయించాలని అదేశించారు.
- ఆస్పత్రిలో కావాల్సిన మందులు, బెడ్‌లు, రాపిడ్ టెస్ట్ కిట్స్ అదనంగా అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఆస్పత్రిలో ఆయన సమీకృత సలహా పరీక్ష కేంద్రం, ఆయుష్ విభాగం, ఫార్మసీ, ల్యాబ్, ఇన్ ఔట్ పేషెంట్ విభాగాలను పరిశీలించి ల్యాబ్ అధునాతమైన టెస్టింగ్ పరికరాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.
- జిల్లా వైద్యాధికారి రఘునాథ్, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, మండల అధికారులు, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

మంద కృష్ణతో ఎమ్మార్పీఎస్ నేతల భేటీ



మేడ్చల్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ ఎమ్మార్పీఎస్ నాయకులు భానుచందర్, సుధాకర్ తదితరులు కలిశారు. నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ కోసం అవిశ్రాం పోరాటాలు లక్ష్యాన్ని సాధించిన ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

రైతులకు తిరిగి పంట రుణాలిస్తాం

కీసర: కీసర రైతు సహకార సంఘంలో పంట రుణాలు మాఫీ అయిన రైతులకు తిరిగి పంట రుణాలను అందజేస్తామని పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ... పంట రుణాలు కావాల్సిన రైతులు కీసర తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని రైతు సహకారా సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. దీంతోపాటు సస్టైటీలో బ్లాక్ తార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు కొనుగోలు చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం


విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణంలో పాల్గొన్న విద్యార్థులు

కీసర: విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం అత్యంత ప్రాధాన్యత కలిగిన వైదిక ప్రార్థనల్లో ఒకటి అని, వెయ్యి నామాలతో ప్రార్థన చేయటం అని విశ్వ విష్ణు సహస్ర నామ సంస్థాన్ సభ్యురాలు కమలాకుమారి అన్నారు. శుక్రవారం నాగారం సెరినిటీ పాఠశాల్లో 1000 మంది విద్యార్థులచే విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ నిర్వహణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విష్ణుసహస్ర నామాన్ని జపించడం వల్ల విద్యార్థులలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మెరుగుపరుచుకోవడంతో, వారికి చదువుపై బాగా దృష్టి పెట్టడానికి ఉచ్చారణ మెరుగుపరడానికి ఇది బాగా సహాయపడుతుందన్నారు. ప్రముఖ హోమియో వైద్యులు, సంఘం సభ్యులు పద్మజా రావు మాట్లాడుతూ... మొదటిగా విష్ణు సహస్ర నామస్తోత్రం మహాభారతంలో అనుశాసనిక పర్వంలో 149వ అధ్యాయంలో ఉందని తెలిపారు. ఈ స్తోత్ర పారాయణ సకల వాంచితార్థ ఫలదాయకమని సంఘం సభ్యులు రాధికి మహీంద్రీకర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, పాఠశాల కార్యదర్శి నోముల వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకే ప్రభుత్వ భూములు

కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి

జవహర్‌నగర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ప్రభుత్వ భూముల పరిరక్షణకై మున్సిపల్, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారి వివరాలు సేకరించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను కాపాడి ప్రజావసరాలకు వినియోగమయ్యేలా చర్యలు తీసుకుందామని రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందికి పిలుపునిచ్చారు. టౌన్‌ప్లానింగ్ జూనియర్ అసిస్టెంట్ పాండు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విజయేంద్రసాయి, రికార్డ్ అసిస్టెంట్లు కాశీరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా చేశారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, కవిత దంపతులు, నాయకులు యాదగిరి, బాలరాజ్, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా పల్లె దవాఖానా, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కార్యదర్శిని ఆదేశించారు. పల్లె దవాఖానాలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, ఏపీఎం తౌర్యనాయక్, వైద్యులు ఫణీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ సాంబశివరావు

అనారోగ్యం తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: అనారోగ్యం కారణంగా ఓ వ్యక్తి ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌స్పెక్టర్ సైదులు సమాచారం మేరకు... బీహార్ రాష్ట్రం సీతామర్హి జిల్లా రున్ని సైద్‌పూర్‌కు చెందిన అభిషేక్(20) దినసరి కూలీ. ఏడాది క్రితం సోదరుడితో హైదరాబాద్‌కు జీవనోపాధి కోసం వచ్చి దమ్మాయిగూడలో నివాసం ఉంటున్నాడు. గురువారం పట్టణంలోని శివారెడ్డిగూడలో పని పూర్తి చేసుకొని అక్కడే ఉన్న షెడ్‌లో నిద్రించాడు. వ్యాపారి శ్రీనివాస్‌రావు రాత్రి అభిషేక్ ఫోన్‌కు ఫోన్ చేయగా లేపకపోవడంతో షెడ్ వద్దకు వచ్చి చూడగా చున్నీతో సీలింగ్ రాడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్‌రావు తన సోదరుడు కిషన్‌కుమార్‌కు సమాచారం ఇచ్చాడు. అనంతరం ఇరువురు మృతుడి సోదరుడు జితేందర్‌రాయ్‌కు సమాచారమివ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్నాడు. కాగా మృతుడు కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్నట్లు, ప్రస్తుతం కూడా అనారోగ్యంతో ఉన్నట్లు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

నేడు సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ శ్రీ సంతోషిమాత, శ్రీ సాయిబాబా మందిరంలో ఈ నెల 17,18,19 తేదీల్లో ఊయలలో పడుకున్న సాయి బాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎంఎల్.కాంతారెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు వేద పండితులచే పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

'మూడు గ్రామాలను బీబీనగర్‌లో కలపొద్దు'


ఎంపీ ఈటలకు వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

ఘట్‌కేసర్: అవుషాపూర్, అంకుషాపూర్, మాదారం గ్రామాలను యాదాద్రి జిల్లాలో కలుపొద్దని కోరుతూ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు అఖిలపక్ష నాయకులు శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. మూడు గ్రామాలను ఘట్‌కేసర్ మండలంలోనే ఉంచాలని, లేదంటే మున్సిపాలిటీలో కలపాలని కోరారు. వెంటనే ఎంపీ ఈటల కలెక్టర్‌కు ఫోన్ చేసి ప్రజల సమ్మతి లేకుండా ఎలా విలీనం చేస్తారని ప్రశ్నించారు. అనంతరం మూడు గ్రామాలు మేడ్చల్ జిల్లాలో ఉండేలా చూస్తానని అఖిలపక్ష నాయకులకు ఎంపీ హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, శోభారాణి, ఐలయ్య యాదవ్, మశ్చేందర్‌రెడ్డి, వామన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శంకర్, సాయిలు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 25వ డివిజన్‌లో కార్పొరేటర్ జమాల్‌పూర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్ అంతటా ప్రగతి పనులు జరుగుతున్నాయన్నారు. డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్పొరేటర్లు మేక లలితాయాదవ్, గొడుగు వేణు, డివిజన్ అధ్యక్షుడు శేఖర్, నాయకులు కోటేష్‌గౌడ్, అశోక్, రవియాదవ్, ఓంప్రకాష్, లక్ష్మీ, సిద్దులు, ఉమా, మంగమ్మ, శివ, వినోద్, కవిత, రాములు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల వితరణ



కీసర: మండలంలోని వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు కూర్చునేందుకు కీసర గ్రామానికి చెందిన నూకలగూడెం సత్తిరెడ్డి కుర్చీలను విరాళంగా అందజేశారు. శుక్రవారం కీసర దాయర, కీసర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సత్తిరెడ్డి అందజేసిన కుర్చీల పంపిణీ కార్యక్రమంలో కీసర రైతు సహకార సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి పాల్గొనారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. నేతలు నూకల గూడెండ చిన్నప్పరెడ్డి, పన్నాల బుచ్చిరెడ్డి, యాదిరెడ్డి, నాయకపు వెంకటేష్, గండు బాబుయాదవ్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మేడ్చల్ కన్వీనర్‌గా రామతీర్థ


నియామక పత్రం అందుకుంటున్న రామతీర్థ

ఘట్‌కేసర్: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మేడ్చల్ నియోజకవర్గ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన గుండ్ల రామాతీర్థ ఎన్నికయ్యారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యనిర్వాహక కార్యదర్శి రావినూతల శశిధర్ ఆయనకు శుక్రవారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆలె భాస్కర్, మేడ్చల్ జిల్లా కోఆర్డినేటర్ నాయిని బుచ్చిరెడ్డి, సెంట్రల్ కమిటీ సభ్యుడు ఇంద్రాల రమేశ్, ఉత్సవ సమితి నాయకులు పాల్గొన్నారు.

బంగారు చీర అలంకరణలో అమ్మవారు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవీ అమ్మవారు వరలక్ష్మి శుక్రవారం సందర్భంగా బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు ప్రేయసి నిరసన

వివాహం చేసుకోవాలంటున్న యువతి

ఘట్‌కేసర్: ప్రేమిస్తున్నాను, పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీరా వివాహం చేసుకోవాలని అడిగితే నిరాకరించడంతో ప్రియుడి ఇంటి ముందు ప్రేయసి నిరసనకు దిగిన సంఘటన అవుషాపూర్‌లో శుక్రవారం జరిగింది. వివరాలివీ... అవుషాపూర్ గ్రామానికి చెందిన ఓ యువతి, వైశ్య సామాజిక వర్గానికి చెందిన సాయి అనే యువకుడు నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. యువకుడు రెండేళ్ల క్రితం ఉన్నత విద్యాభ్యాసానికి విదేశానికి వెళ్లాడు. యువకుడు వివాహం చేసుకోవడానికి నిరాకరించాడని ఆ యువతి ప్రియుడి ఇంటి ముందు నిరసనకు దిగింది. నాలుగేళ్లుగా ప్రేమించిన యువకుడితో తనకు పెళ్లి జరిపించాలని, గతంలో తన మెడలో పసుపు కొమ్ము కట్టి వివాహం చేసుకున్నాడని ఆరోపించింది. ప్రేమ పెళ్లి విషయమై యువతి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.